# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 27-07-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన ఈ రోజు నీతి ఆయోగ్ 9వ పాలక మండలి సమావేశం జరుగుతుంది.**
2. కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయమంత్రి ఎల్.మురగన్ ఈరోజు రాష్ట్రంలో పర్యటించనున్నారు.
3. **ఆంధ్రప్రదేలో మడ అడవుల పరిరక్షణ కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు.**
4. **తెలంగాణలో ధరణి పోర్టల్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు.**
5. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.**
6. **శాస్త్ర సాంకేతిక రంగాల పరిశోధకునిగా, రాష్ట్రపతిగా సేవలందించిన భారత రత్న డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం వర్ధంతి ఈరోజు.**

==========================

ఢిల్లీ రాష్ట్రపతి భవన్‌లోని సాంస్కృతిక కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన ఈ రోజు నీతి ఆయోగ్ 9వ పాలక మండలి సమావేశం జరుగుతుంది. ఈ ఏడాది వికసిత్ భారత్ ఏ 2047 ఇతివృత్తంతో ఈ సమావేశం జరుగుతుంది. అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను తీర్చిదిద్దడం, వికసిత్ భారత్ దార్శనిక పత్రానికి ప్రతిపాదనలు వంటి అంశాలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చిస్తారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పాలనా భాగస్వామ్యం, సహకారం పెంపొందించడం గ్రామీణ, పట్టణ జనాభాల జీవన నాణ్యతను పెంచే లక్ష్యంగా ఈ చర్చలు జరుగుతాయి. నీతి ఆయోగ్ అధ్యక్షులుగా ప్రధానమంత్రి ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో సహా ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు , గవర్నర్లు, కేంద్ర మంత్రులు, నీతి ఆయోగ్ ఉపాధ్యక్షులు, సభ్యులతో పాటు ఇతర అధికారులు హాజరవుతారు.

--------------------------

కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయమంత్రి ఎల్.మురగన్ ఈరోజు రాష్ట్రంలో పర్యటించనున్నారు. ఈ ఉదయం ఢిల్లీ నుంచి బయలుదేరి విజయవాడ విమానాశ్రయానికి చేరుకుంటారు. విజయవాడలో నిర్వహించే

పాత్రికేయుల సమావేశంలో పాల్గొంటారు. అనంతరం పత్రికాసమాచార కార్యాలయం, ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. అలాగే విజయవాడలో పలు కార్యక్రమాల్లో మంత్రి పాల్గొంటారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో మడ అడవుల పరిరక్షణ కోసం వెంటనే ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. అంతర్జాతీయ మడ అడవుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరిలోని రాష్ట్ర అటవీ శాఖ ప్రధాన కార్యాలయంలో అధికారులతో నిన్న ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మడ అడవుల విస్తీర్ణం పెంచే ప్రక్రియలో అవసరమైతే కార్పొరేట్ సంస్థల భాగస్వామ్యాన్ని తీసుకోవాలని, వారి నుంచి నిధులు సేకరించాలని పేర్కొన్నారు. మడ అడవుల పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'మిస్టీ' కార్యక్రమంలో భాగంగా రాబోయే ఐదేళ్లలో 700 హెక్టార్లలో మడ అడవుల విస్తీర్ణాన్ని పెంచాలని అధికారులను ఆదేశించారు. ఇలా ఉండగా అంతర్జాతీయ మడ అడవుల సంరక్షణా దినోత్సవం పై ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈ రోజు మధ్యాహ్నం 3 గంటల 30 నిమిషాలకు ప్రసారమవుతుంది.

---------------------------

తెలంగాణలో భూ సంబంధిత ధరణి పోర్టల్ సమస్యల పరిష్కారానికి విస్తృతంగా అధ్యయనం చేసి శాశ్వత పరిష్కారం చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో ధరణి పోర్టల్‌లో సమస్యలు, మార్పులు-చేర్పులు ఇతర అంశాలపై ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోర్టల్‌లో సవరణల వల్ల కొత్త సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మార్పులు, చేర్పులపై ప్రజాభిప్రాయం, అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి వారి అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకోసి అభిప్రాయాలు, సూచనల ఆధారంగా సమగ్ర చట్టం తేవాలన్నారు. ధరణిపై అవసరమైతే శాసన సభలో చర్చ చేపడతామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ మనసులోని మాట" కార్యక్రమం 112వ సంచిక ఈ ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. ఈ కార్యక్రమం ఆకాశవాణి, దూరదర్శన్ నెట్ వర్క్, ఏఐఆర్ న్యూస్ వెబ్ సైట్ ద్వారా న్యూస్ ఆన్ ఎయిర్ మొబైల్ యాప్‌లో ప్రసారం కానుంది. మన్ కీ బాత్ హిందీ ప్రసంగం ప్రసారమైన వెంటనే అన్ని ఆకాశవాణి ప్రాంతీయ భాషల్లో దీని అనువాదం ప్రసారం అవుతుంది.

---------------------------

గోదావరి వరద బాధితుల్ని ఆదుకుంటామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. నిన్న శాసనసభలో ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, ఏలూరు జిల్లాలు వరద ప్రభావానికి గురయ్యాయని తెలిపారు. 4,317 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లిందని, 1.06 లక్షల ఎకరాల్లో వరి నాట్లు ముంపునకు గురయ్యాయన్నారు. వరద బాధితుల కోసం ప్రభుత్వం సహాయక శిబిరాలు ఏర్పాటు చేసిందని, శిబిరాల్లో ఉన్న వారికి 3వేల రూపాయల చొప్పున ఆర్థిక సాయం, 25 కేజీల బియ్యం, లీటర్ పామాయిల్, కందిపప్పు,

బంగాళదుంపలు, ఉల్లిపాయలు కేజీ చొప్పున అందిస్తామని చెప్పారు . పంట నష్టాన్ని ప్రాథమికంగా అంచనా వేయాలని మంత్రులు, అధికారులకు ఆదేశాలిచ్చామని ముఖ్యమంత్రి తెలిపారు.

---------------------------

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 90 రోజుల్లోనే 31 వేల ఉద్యోగ నియామక పత్రాలు అందించామని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు. రంగారెడ్డి జిల్లాలోని వట్టినాగులపల్లిలో నిన్న నిర్వహించిన అగ్నిమాపక శాఖ పాసింగ్ అవుట్ పరేడ్‌లో ముఖ్యమంత్రి పాల్గొని మాట్లాడుతూ, విపత్తును జయించే సామాజిక బాధ్యత అగ్నిమాపక శాఖ ఉద్యోగులపై ఉంటుదని తెలిపారు. ప్రజల ఆలోచనలు వినడం ప్రభుత్వ విధానమన్నారు. పేదలకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా బడ్జెట్‌లో విద్య, వ్యవసాయానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చామని చెప్పారు. నిరుద్యోగులకు తగిన ఉపాధి అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ముందుకెళ్తోందని పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని నగరపాలక సంస్థ పరిధిలో రహదారి డివైడర్లపై ఉండే ఫ్లెక్సీలను తక్షణమే తొలగించాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిన్న రాష్ట్రంలోని 8 నగరపాలక సంస్థల కమిషనర్లతో మంత్రి సమావేశమయ్యారు. ఆయా ప్రాంతాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, టిడ్కో గృహనిర్మాణాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారుల మధ్య ఉండే డివైడర్లపై ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. నగరాల్లో పార్కులు, రహదారి డివైడర్లు, రోడ్ల గుంతలు, మురుగు నీటి వ్యవస్థలో పూడిక తొలగింపుపై దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. వానాకాలం నేపథ్యంలో అతిసార వంటి వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు పట్టణ ప్రణాళికలపై ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా చూడాలని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

తెలంగాణలో లే అవుట్ క్రమబద్ధీకరణ పథకం-ఎల్ఆర్ఎస్ అమలు కోసం కొత్త జిల్లాల వారీగా బృందాలు ఏర్పాటు చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ విధివిధానాల అమలుపై నిన్న హైదరాబాద్ సచివాయలంలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారుఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, తెలంగాణ వ్యాప్తంగా 39 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వీలైనంత వేగంగా పరిష్కరించాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఎల్ఆర్ఎస్ అమలు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల వారీగా బృందాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

శాస్త్ర సాంకేతిక రంగాల పరిశోధకునిగా, రాష్ట్రపతిగా, విద్యార్థులకు మార్గనిర్దేశకుడిగా, రచయితగా అసమాన ప్రతిభా పాటవాలు చూపిన మహోన్నత వ్యక్తి డాక్టర్ అవుల్ పకీర్ జైనలుద్దీన్ అబ్దుల్ కలాం వర్ధంతి ఈరోజు. ఏపీజే అబ్దుల్ కలాంగా సుపరిచితమైన ఆయన భారతదేశ మిస్సైల్ మేన్గా ఖ్యాతి గడించారు. కలలు కనండి.. వాటిని సాకారం చేసుకోండి అని కలాం ఇచ్చిన పిలుపుతో యువతలో ఆత్మవిశ్వాసం నింపారు. శాస్త్రవేత్తగా వృత్తి జీవితాన్ని ప్రారంభించిన కలాం, అంతరిక్ష పరిశోధనల్లో భారత్కు ఎన్నో విజయాలు అందించారు. 2015 జులై 27వ తేదీన మేఘాలయ రాజధాని షిల్లాంగ్‌లో ఐఐఎం విద్యార్థులకు మార్గనిర్దేశం చేస్తూనే ఆయన తుదిశ్వాస

విడిచారు. ఆయన సేవలకు గుర్తింపుగా దేశ అత్యుత్తమ పురస్కారం భారతరత్నతో సహా ఎన్నో జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు ఆయనను వరించాయి.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో శాంతి భద్రతలు అదుపులోనే ఉన్నాయని రాష్ట్ర హోం మంత్రి వి.అనిత తెలిపారు. నిన్న రాష్ట్ర శాసనమండలిలో మంత్రి మాట్లాడుతూ, ప్రతిపక్ష పార్టీ నాయకులు సహా ఆ పార్టీ సానుభూతిపరులపై ఎక్కడా ఉద్దేశపూర్వకంగా దాడులు జరగట్లేదని తెలిపారు. యాదృచ్ఛికంగా జరిగిన స్వల్ప ఘటనలకు బాధ్యులు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వంపై అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారన్నారు.

---------------------------

తెలంగాణలోని కాళేశ్వరం ప్రాజెక్టును గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే మరమ్మత్తులు చేపట్టాల్సి వచ్చిందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ జలసౌధలో నిన్న మంత్రి పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ, ఏడాదికి కాళేశ్వరంపై 15వేలకోట్లు ఖర్చు చేయాల్సి వస్తుందన్నారు. దాదాపు 94 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తే కాళేశ్వరం ఆయకట్టు కింద కేవలం 93 వేల ఎకరాలు మాత్రమే నూతనంగా సాగులోకి వచ్చిందని చెప్పారు. జాతీయ డ్యాం భద్రతా సంస్థ సలహా, సూచనల మేరకే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీ గేట్లు తెరిచామని, ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి రెండ్రోజుల్లో పంపింగ్ ప్రారంభిస్తామని తెలిపారు.

======================